క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

• యాచకుడి మృతి



కోవూరు: కోవూరులోని పడుగుపాడు జాతీయ రహదారి సమీపంలో శివాలయం వద్ద సోమవారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న యాచకుడిని గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. అతడి వివరాలను ఆరాతీస్తున్నారు.

మైనార్టీల సమావేశంలో అబ్దుల్ రెహమాన్



సజ్జల రామకృష్ణారెడ్డితో రెహమాన్

కోవూరు: వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్రస్థాయి సమావేశం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగింది. ఇందులో కోవూరు నియోజకవర్గ మైనారిటీ విభాగం అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలను కలిసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు.

లైంగికదాడి కేసుపై విచారణ

ఇందుకూరుపేట: మండలంలోని లేబూరు మజరా అవ్వతాత కాలనీలో బాలికపై జరిగిన లైంగికదాడికి సంబంధించిన కేసును ట్రెయినీ డీఎస్పీ శివప్రియ, కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి సోమవారం విచారించారు. కేసు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు.

➡ డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ లేబూరుకు చేరుకుని బాధితురాలి తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారు. తగిన న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు బాబయ్య, శ్రీకాంత్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

నెల్లూరు రూరల్: డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన కొప్పోలు చిరంజీవిపై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యుడు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆయన అసోసియేషన్‌కు చెందిన దుకాణాలకు అడ్వాన్సులు, అద్దెలు దండుకున్నారని ఆరోపించారు. అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

లారీ డ్రైవర్ మృతి

నెల్లూరు సిటీ: ఓ లారీ డ్రైవర్ తన క్యాబిన్‌లో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటుతో మృతిచెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడులోని సేలం ప్రాంతానికి చెందిన రాజశేఖరన్ (46) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. దూర ప్రాంతాలకు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటాడు. ఈ క్రమంలో చెన్నై నుంచి విజయవాడకు వెళ్లి తిరుగు ప్రయాణంలో నెల్లూరు రూరల్ అల్లీపురం వెంకట విఘ్నేశ్వర రైస్‌మిల్లులోని ధాన్యం లోడ్ చేసేందుకు ఆదివారం సాయంత్రం చేరుకున్నాడు. లోడింగ్ చేసుకునేందుకు ఆదివారం రాత్రి అక్కడే లారీని పార్కింగ్ చేసుకుని క్యాబిన్‌లో నిద్రించాడు. ఉదయం కూలీలు నిద్రలేపే ప్రయత్నం చేయగా స్పందించలేదు. పరిశీలించగా గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని నిర్ధారించారు. మృతుడి భార్య గోమతి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి



చిన్నారిని అప్పగిస్తున్న సీఐ

నెల్లూరు సిటీ: తప్పిపోయిన కుమార్తెను పోలీసులు గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రూరల్ మండలంలోని నాలుగో మైలుకు చెందిన జలీల్ తన భార్యతో కలిసి ఆదివారం నగరంలోని భగత్‌సింగ్ కాలనీ టిడ్కో సముదాయంలో తెలిసిన వారి ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో రాత్రి ఆలస్యమవడంతో అక్కడే నిద్రించారు. ఈ క్రమంలో మూడేళ్ల పాప భవ్య సోమవారం ఉదయం కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వేణుగోపాల్‌రెడ్డి వెంటనే స్పందించి తన సిబ్బందితో గాలించారు. గంటల వ్యవధిలో పాపను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు.

బస్సులు నిలపండి సారూ..

• గ్రామీణ విద్యార్థినుల పడిగాపులు



కొడవలూరు బస్టాప్‌లో వేచి ఉన్న విద్యార్థినులు

కొడవలూరు: కొడవలూరు బస్టాప్‌లో ఆర్టీసీ బస్సులు నిలపకపోవడంతో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు పడిగాపులు తప్పడం లేదు. స్థానిక హైస్కూల్‌కు మండలంలోని గుండాలమ్మపాళెం, బసవాయపాళెం, పద్మనాభసత్రం, దామేగుంట, తలమంచి గ్రామాల నుంచే కాక విడవలూరు మండలం చౌకచర్ల నుంచి కూడా బాలికలు వస్తుంటారు. బాలురు సైకిళ్లపై వస్తుండడంతో వారు బస్సులపై ఆధారపడరు. బాలికలు మాత్రం పాఠశాలలకు బస్సుల్లోనే వస్తుంటారు. వీరంతా కొడవలూరు సెంటర్‌లోని బస్టాప్‌లో దిగి పాఠశాలకు వెళ్లడం, తిరిగి అదే బస్టాప్‌లో బస్సులను ఎక్కుతుంటారు. అల్లూరు, రామతీర్థం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులనే వీరు నమ్ముకొంటారు. సాయంత్రం పాఠశాల వదిలాక బాలికలంతా కొడవలూరు సెంటర్‌లోని బస్టాప్‌కు చేరుకొంటారు. ఇక్కడ బాలికలు పదుల సంఖ్యలో బస్సు కోసం వేచి ఉంటారు. కానీ ఆ సమయంలో అటుగా వెళ్లే ఆర్టీసీ బస్సులు బస్టాప్‌లో నిలపడం లేదు. దీంతో బాలికలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో చీకటి పడే వరకు కూడా బాలికలు బస్టాప్‌లోనే వేచి ఉంటున్నారు. పిల్లలు సమయానికి ఇంటికి రాకపోతుండడంతో తల్లిదండ్రుల్లోనూ ఆందోళన నెలకొంటోంది.

గతంలో ధర్నా

ఇక్కడి పాఠశాల విద్యార్థులంతా బస్టాప్ వద్ద బస్సులు నిలపాలని గతంలో కూడా ధర్నా చేశారు. దీంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాప్‌లో విధిగా బస్సులు నిలిపేలా చర్యలు తీసుకున్నారు. కొంత కాలం సజావుగానే నిలుపుతూ వచ్చినా మరలా సమస్య మొదటికొచ్చింది. బస్సులోని సీట్‌లు భర్తీ అయ్యాయన్న నెపంతో ఆపకుండా వెళ్తున్నట్టు సమాచారం. పిల్లలు బస్సులో సీటు లేకపోయినప్పటికీ సమీపంలోని ఊర్లే కావడంతో బస్సులో నిల్చొని ప్రయాణించేందుకు సిద్ధంగా ఉంటారు. అయినా బస్సులు ఆపకపోవడం బాలికలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఆర్టీసీ ఉన్నతాధికారులైనా స్పందించి కొడవలూరు బస్టాప్‌లో ఆర్టీసీ బస్సులు నిలిచేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న పూజిత, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

• కాకాణి పూజిత

ముత్తుకూరు(పొదలకూరు): 'కార్యకర్తలు అధైర్యపడొద్దు. ఎలాంటి సమస్యలు వచ్చినా అండగా ఉంటాం' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత అన్నారు. ముత్తుకూరు మండల పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ కేసులతో తన తండ్రిని జైల్లో పెట్టారన్నారు. మొక్కవోని ధైర్యంతో తమ కుటుంబం కేసులను ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల అండదండలు బాగా ఉన్నాయని, వారి ఆశీస్సులతోనే నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఆగని చికెన్ వ్యర్థాల రవాణా

• కొడవలూరులో మినీ లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న మినీ లారీ

కొడవలూరు: చికెన్ వ్యర్థాల రవాణా ఆగడం లేదు. తాజాగా కొడవలూరులో మినీ లారీని ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి సోమవారం సీజ్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. నియోజకవర్గంలోని ఏదో ఒక మండలంలో తరచూ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలను పట్టుకుంటూనే ఉన్నారు. గతంలో కేవలం మినీ లారీల్లో ట్రక్కుకి పట్టలు కట్టి తరలించేవారు. వీటిని పోలీసులు సులువుగా పసిగడుతుండటంతో ట్రాక్టర్లలో తరలించడం ప్రారంభించారు. వాటిని కూడా పట్టుకుంటుండటంతో ఆటోల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నట్లు సమాచారం. రాత్రి వేళల్లోనే అధికంగా వీటి తరలింపు సాగుతోంది.

విడవలూరులో సర్వసభ్య సమావేశం



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

విడవలూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ నగేష్‌కుమారి మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తెలియజేసి వాటిని పరిష్కరించుకోవాలని కోరారు. అదే విధంగా ప్రజలకు అవసరమైన పనులను ముందుగా ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.చంద్రశేఖర్, ఎంపీపీ శేషమ్మ, వైస్ ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

• నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ఇందుకూరుపేట మండలంలో బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని, గిరిజన బాలికను హింసించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన శిక్షలు విధించేలా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

పొదలకూరు: మండలంలోని సోమశిల రోడ్డు కనుపర్తి గ్రామ క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పెంచలకోనకు వెళ్తున్న బస్సును పొదలకూరు వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బస్సు పాక్షికంగా దెబ్బతింది. అయితే ప్రయాణికులకు గాయలు కాలేదని తెలిసింది. ఇరువర్గాల వారు రాజీకి వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వెళ్లినట్టు సమాచారం.

బైక్ అదుపుతప్పి..

• వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బుజబుజ నెల్లూరు ప్రాంతానికి చెందిన అశోక్ పని నిమిత్తం బైక్‌పై ముత్తుకూరు మండలంలోని పంటపాళెం గ్రామానికి వెళ్లాడు. తిరిగి బుజబుజనెల్లూరుకు వెళ్తుండగా సర్వేపల్లి సమీపంలో మలుపురోడ్డు వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో అశోక్‌కు గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

మల్లెంకొండలో అన్నదమ్ముల అదృశ్యం



కనిపించకుండా పోయిన వృద్ధులు

మనుబోలు: మండలంలోని నాయుడుపాళెం గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు జిల్లాలోని సోమశిల అటవీ ప్రాంతంలో మల్లెంకొండ వద్ద అదృశ్యమయ్యారు. వివరాలు.. నాయుడుపాళెనికి చెందిన వృద్ధులైన కోటపాటి రత్నయ్య, ఆయన సోదరుడు సుబ్బయ్య గత నెల 25వ తేదీన మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి మెట్ల మార్గంలో వెళ్లారు. రాత్రి అక్కడే బస చేశారు. పక్కరోజు కిందకు రాలేదు. కుటుంబ సభ్యులు ఆందోళన చెంది బంధుమిత్రులతో కలిసి చుట్టుపక్కల ప్రాంతాలంతా వెతికారు. ఆచూకీ లభించలేదు. రెండు రోజుల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మల్లెంకొండ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు.

చెరువును కాపాడండి

• బీజేపీ నాయకుల డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని పొదలకూరు, లింగంపల్లి రైతుల ఆయకట్టు చెరువును ఆక్రమణల చెర నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం తహసీల్దార్ బి.శివకృష్ణయ్యకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు ఆక్రమణలకు గురికావడంతోపాటు చెత్తాచెదారం, మురుగునీటితో నిండిపోయినట్టు తెలిపారు. హద్దులు ఏర్పాటు చేస్తే ఏ మేరకు ఆక్రమణలకు గురైందో తెలుస్తుందన్నారు. పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వాడిన సిరంజీలు, ఇతర వస్తువులను చెరువులో పడేస్తున్నట్టు ఆరోపించారు. నల్లతుమ్మ చెట్లు ఉన్నాయని వాటిని వేలం వేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా నాయకులు సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, చొప్పా వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ నాయుడు, జనార్దనరెడ్డి, రాజేష్, పిచ్చయ్య, రంగారావు తదితరులు డిమాండ్ చేశారు.

పశుసంవర్ధక శాఖలో బదిలీలు



మురళీకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పొదలకూరు: మండలంలో పశుసంవర్ధక శాఖలో బదిలీలు జరిగాయి. తాటిపర్తి పశువైద్యాధికారి డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణారెడ్డి ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెనికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఆయన ఆరేళ్లపాటు సేవలందించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన స్థానంలో బుచ్చిరెడ్డిపాళెం దామమడుగు నుంచి శివతేజారెడ్డి తాటిపర్తి పశువైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. విరువూరు నుంచి వీఎల్‌ఓ శిఖామణి తిరుపతి జిల్లాకు, డేగపూడి ఎల్‌ఎస్‌ఓ వెంకటగిరికి, మరుపూరు జేవీఓ డానియల్ ప్రకాశం జిల్లాకు, అటెండర్ స్వర్ణలత నెల్లూరుకు బదిలీ అయ్యారు. రత్నమ్మ విరువూరుకు, వెంకటేశ్వర్లు డేగపూడికు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో డాక్టర్ మురళీకృష్ణారెడ్డికి సోమవారం ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు.

న్యాయం చేయండయ్యా..



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పోలీస్ అధికారులు

నెల్లూరు సిటీ: మా వినతుల్ని పరిశీలించి న్యాయం చేయండి సారూ అంటూ ప్రజలు కోరారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో అధికారులు 74 ఫిర్యాదులు స్వీకరించారు. తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు బాధితులకు భరోసా ఇచ్చారు. సమావేశంలో నగర డీఎస్పీ సింధుప్రియ, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ 2 సీఐ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

➡ మ్యాట్రిమోనీ ద్వారా వెస్ట్ గోదావరికి చెందిన మల్లుల రాజకుమార్‌తో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.3 లక్షలు తీసుకున్నాడు. వివాహం చేసుకోకుండా దూరం పెడుతున్నాడు. నగదు ఇవ్వడం లేదని కొండాపురానికి చెందిన దివ్యాంగురాలు ఫిర్యాదు చేశారు.

➡ బిట్రగుంట పరిధిలోని ఓ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాను. తెల్లగుంటకు చెందిన బూదురు భరత్ కుమార్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తననే పెళ్లి చేసుకోవాలని లేకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడని దగదర్తికి చెందిన డిగ్రీ విద్యార్థిని వినతి పత్రం ఇచ్చారు.

➡ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేస్తున్నానని, ఇంటి రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మించి ఒకరు రూ.2.10 లక్షలు తీసుకున్నాడు. రిజిస్ట్రేషన్ చేయించలేదు. డబ్బు తిరిగి ఇవ్వమంటే స్పందించడం లేదని చిన్నబజారుకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

➡ నా కుమారుడు రూ.3 కోట్ల విలువ చేసే ఆస్తి తీసుకున్నాడు. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగోలేదు. కనీసం అన్నం కూడా పెట్టడం లేదని మనుబోలుకు చెందిన ఓ వృద్ధుడు వినతిపత్రమిచ్చాడు.

➡ నేను టీబీ వ్యాధితో బాధపడుతున్నాను. నా పేరు మీద ఉన్న రెండు ఎకరాల పొలం, ప్లాట్లు రాసివ్వాలని పెద్ద కుమారుడు, కోడలు ఇబ్బంది పెడుతున్నారని కావలికి చెందిన ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేశారు.

➡ నా కుమార్తె నెలరోజుల నుంచి కనిపించడం లేదు. దానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి. కుమార్తె ఆచూకీ కనుక్కొని అప్పగించాలని నెల్లూరు రూరల్‌కు చెందిన ఓ మహిళ కోరారు.

➡ నేను 2017లో ప్రేమ వివాహం చేసుకున్నాను. ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా నా భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. మమ్మల్ని పట్టించుకోవడం లేదు. భర్త, అత్తమామలు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. నన్ను, పిల్లల్ని ఇంటి నుంచి గెంటేశారు. కౌన్సెలింగ్‌నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని వెంకటాచలం ప్రాంతానికి చెందిన ఓ మహిళ వినతి పత్రం ఇచ్చారు.

ఎస్పీ కార్యాలయంలో బదిలీల ప్రక్రియ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు సిటీ: జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సచివాలయ గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్‌పై ప్రదర్శింపజేసి ర్యాంక్ ప్రకారం నిబంధనలు అనుసరించి బదిలీ ప్రక్రియ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సీహెచ్ సౌజన్య, ఏఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధం

• తప్పిన పెను ప్రమాదం

పొదలకూరు: పట్టణంలోని నాగార్జున స్కూల్‌కు సమీపంలో నివాసం ఉంటున్న అశోక్ అనే వ్యక్తి ఇంట్లో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు దగ్ధమైనట్టు బాధితుడు వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలు చెప్పలేకపోతున్నారు. నిద్రిస్తున్న సమయంలో సోఫాలు, దుస్తులకు మంటలు అంటుకున్నాయి. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. బాధితులు మంటల్ని అదుపు చేసి వస్తువులను బయటపడేసినట్టుగా తెలుస్తోంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్టు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పారు.

వినతుల స్వీకరణ



అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్

మనుబోలు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ రమాదేవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూ సమస్యలపై నాలుగు అర్జీలు వచ్చాయని తెలిపారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ ప్రదీప్ కుమార్, ఎంపీడీఓ జలజాక్షి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొడవలూరులో..

➡ కొడవలూరు: నివేశన స్థలంతో పాటు పక్కా గృహం మంజూరు చేయించి ఆదుకోవాలని కొడవలూరుకు చెందిన డి.భార్గవ్ తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డికి సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందజేసి, ప్రభుత్వం ద్వారా ఇంటి సదుపాయం కల్పించి ఆదుకోవాలని కోరారు. దీనిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకొంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఆదినారాయణస్వామి

పొదలకూరు: పీఎం ప్రణం కిసాన్ సంఘేష్టి రైతులకు సోమవారం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ వారు అవగాహన కల్పించారు. సహజ వనరుల ద్వారా ఉత్పత్తి చేసే నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్ సల్ఫర్ ఫెర్రస్ భవిష్యత్‌లో తరిగిపోయి మొక్కలకు అందుబాటులో ఉండవన్నారు. సదస్సులో చీఫ్ మేనేజర్ ఆదినారాయణస్వామి, వ్యవసాయ ఉప సంచాలకుడు కె.శివనాయక్, ఏఓ ప్రతాప్, అడిషనల్ మేనేజ్ రాము, శాస్త్రవేత్త సురేఖ, ఉద్యానాధికారి ఆనంద్, రైతులు పాల్గొన్నారు.